కథాకేళి

# ఆనెస్ట్ గర్ల్

మల్లాది వెంకటకృష్ణమూర్తి



పార్వతికి నాకు పరిచయం చాలా తమాషాగా జరిగింది. హైదరాబాద్‌లోని ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో జయంట్ వీల్‌లో తిరుగుతుండగా పై తొట్టెలోంచి నా తొట్టెలోకి ఓ హేండ్ బేగ్ వచ్చి పడింది. ఎర్రటి ఆ హేండ్ బేగ్‌ని తెరచి చూస్తే అందులో ఏభై రూపాయల నోటు, చిల్లర, తాళం చెవుల గుత్తి తప్ప అది ఎవరిదో తెలిపే వివరాలు లేవు.

అందులోని చిన్న లేడీస్ హేండ్ కర్చీఫ్‌ని బట్టి అది ఆడవాళ్లదని గ్రహించాను. జయంట్ వీల్ ఆగాక దిగి, దాన్ని చేతిలో పట్టుకుని ఓ పక్కగా నిలబడ్డాను.

పార్వతి నా దగ్గరికి వచ్చి చెప్పింది.

"అది నాదండి. జయంట్ వీల్‌లో తిరుగుతుంటే కిందపడిపోయింది"

"ఇందులో ఏం ఉన్నాయో చెప్పగలరా?" అడిగాను.

కరెక్ట్‌గానే చెప్పింది. దాన్ని ఆమెకు అందిస్తూ అడిగాను.

"ఒక్కరే వచ్చారా?"

"ఫ్రెండ్స్‌తో వచ్చాను. వాళ్లకి భయంట ఎక్కాలంటే అందుకని నేను వంటరిగా ఎక్కాను. చాలా థాంక్సండీ"

పార్వతి మాట, తీరు నన్ను ఆకర్షించాయి. ఆమె అందంకన్నా మాట, తీరే నచ్చాయని చెప్పాలి.

"మీ పేరు చెప్పనేలేదు?" అడిగాను.

"పార్వతి"

"ఏం చేస్తుంటారు" అడిగాను.

"కమర్షియల్ టాక్సెస్ ఆఫీసులో స్టెనోగా పని చేస్తున్నాను. మీరు?" అడిగింది.

"ఎల్ ఐసిలో"

"వస్తానండి. థాంక్స్ ఎగైన్"

"మళ్ళీ ఏమ్మల్నోసారి కలవాలండి" చెప్పాను ఆమె వెనక్కి తిరగ్గానే.

ఆగి ఎందుకన్నట్లుగా చూసింది.

"మీరు ఏ కులస్తులు?" అడిగాను మళ్ళీ. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం నా ప్రశ్నకి.

చెప్పింది.

"థాంక్ గాడ్. మాకులమేనన్నమాట. నాకా పట్టింపువుంది. మీరు నాకు బాగా నచ్చారు. మీకింకా పెళ్ళికాలేదుగదా? మనం చేసుకుంటే ఎలా ఉంటుంది?"

నా మాటలకి ఫక్కున నవ్వింది పార్వతి. "ఐ లవ్ యూ" అనేకంటే ప్రాక్టికల్‌గా మాట్లాడడంతో ఆమెకి నవ్వొచ్చిందని తర్వాత చెప్పింది.

"ఎప్పుడైనా మా ఆఫీసుకి రండి. సాయంత్రం అయిదు తర్వాత వస్తే అక్కడ కూర్చుని మాట్లాడుకోవచ్చు" చెప్పింది.

ఆమె ఆఫీసు ఎక్కడుందో కనుక్కున్నాను. నాలుగు రోజుల తర్వాత ఓ సాయంత్రం వెళ్లాను. పార్వతి ఉంది.

"నిజంగా వచ్చారే" నవ్వింది.

ఆ తర్వాత ఆర్నెల్లల్లో అరవై రెండుసార్లు కలుసుకున్నాం. ఇందిరా పార్కులో, సినిమా హాళ్లలో, టేంక్ బండ్‌మీద, రెస్టారెంట్స్‌లో.. ఒకరంటే ఒకరికి ఆప్యాయత ప్రతి మీటింగ్‌కి పెరగసాగింది. డేటింగ్ అంటారు అమెరికాలో. బ్రిటన్‌లో కోర్టింగ్ అంటారు. తెలుగులో ఏమంటారు దీన్ని? అర్థం చేసుకోవడం అనా?

పార్వతి చాలా ముక్కుసూటి మనిషి. ఎంతో ఆనెస్ట్ గర్ల్. ఓ రోజు పెళ్ళి గురించి ప్రస్తావించాను. పార్వతి కొన్ని క్షణాలు ఆలోచించి చెప్పింది.

"మీకో నిజం చెప్పాలి. అది నా గతం గురించి"

పార్వతి చెప్పేది వింటూండిపోయాను. ఆమెకి పంతొమ్మిదో ఏట, నాలుగేళ్ల క్రితం ఆమె మామయ్యనిచ్చి చేద్దామనుకున్నారు పెద్దలు. ఆ చొరవతో అతనికి దగ్గరైంది. గర్భం వచ్చింది. కానీ మామయ్య చేసుకోను పొమ్మన్నాడు. విధిలేక అబార్షన్ చేయించారు పెద్దలు.

"అంతే. ఆ తర్వాత మగాడంటే దూరంగా ఉండే దాన్ని. మీరు పరిచయం అయ్యాకే మగాళ్లల్లో మంచి వాళ్లుంటారని తెలిసింది" అని చెప్పింది.

పార్వతి తన కన్యత్వం పోగొట్టుకుందని తెలిసినా మనసులో బాధ ముల్లుతో గుచ్చుకున్నా సంభాళించుకున్నాను.

"ఇప్పుడేం చెప్పద్దు. రేపు మీ అభిప్రాయం ఆలోచించి చెప్పండి" అన్నది పార్వతి.

ఆ రాత్రంతా ఆలోచించాను. ఆ ఒక్క లోపం తప్పిస్తే పార్వతిలో అన్నీ నాకు నచ్చినవే. ఆమెని మర్నాడు కలిశాను. ఆత్రంగా చూశాయి ఆమె కళ్ళు, వెదుకుతున్నట్లుగా చూశాయి నా మనసులో ఏం నిర్ణయం చేసుకున్నానో తెలుసుకోవాలన్నట్లుగా.

"నువ్వు ఆనెస్ట్‌గా చెప్పావు పార్వతి. నేనూ ఆనెస్ట్‌గా చెబుతాను. నాకు నీకున్న లాంటి ఎఫైర్ ఒకటుంది. మా ఇంటావిడతో రెండేళ్లు అలా సాగింది. ఆవిడ విడో. నాకన్నా రెండేళ్ళు పెద్ద. వాళ్ల వాళ్లకి తెలిసి ఆమెకి పునర్వివాహం చేశారు."

పార్వతి నే చెప్పింది విని స్టన్నయింది. ఆమె కళ్లల్లో వెంటనే నీళ్ళు తిరిగాయి. రెస్టారెంట్ లోంచి లేచి బయటికి వెళ్ళిపోయింది ఏడుస్తూ.

మర్నాడు ఫోన్లో చెప్పింది పార్వతి నాకు.

'నా కాబోయే భర్త రెండేళ్లపాటు పరాయి స్త్రీని మరిగితే నేను సహించలేను సారీ... మన వివాహం జరగదు. ఇంక మనం కలవద్దు.

"కాని..."

"నా మాటలకి అడ్డు చెప్పద్దు. ఐయామ్ వెరీ ఆనెస్ట్ అబౌట్ మై ఫీలింగ్స్ అందుకే ముందే చెప్తున్నాను. మనిద్దరి వివాహం జరిగినా మీ జీవితం నరకం అవుతుంది"

ఫోన్ పెట్టేసింది పార్వతి.